# జ్యోతిరావు పూలే నేటి తరానికి స్ఫూర్తి

- రంగారెడ్డి, వికారాబాద్ కలెక్టర్లు శశాంక, నారాయణరెడ్డి, వికారాబాద్ ఎస్పీ కోటిరెడ్డి, అసెంబ్లీ స్పీకర్ ప్రసాద్‌కుమార్
- జ్యోతిరావు పూలే 198వ జయంతి సందర్భంగా ఘన నివాళి



జ్యోతిరావు పూలే చిత్రపటానికి నివాళులర్పిస్తున్న రంగారెడ్డి కలెక్టర్ శశాంక తదితరులు

రంగారెడ్డి, ఏప్రిల్ 11 (నమస్తే తెలంగాణ) : బడుగు బలహీన వర్గాల అభ్యున్నతికి, మహిళా విద్యకు మార్గదర్శకులు జ్యోతిరావు పూలే నేటి తరానికి స్ఫూర్తి అని రంగారెడ్డి కలెక్టర్ శశాంక అన్నారు. గురువారం మహాత్మా జ్యోతిరావు పూలే 198వ జయంతి సందర్భంగా జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో కలెక్టర్ శశాంక పాల్గొని పూలే చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. కుల వివక్షకు వ్యతిరేకంగా సమాజం కోసం పోరాడిన, బహుజన తత్వవేత్త సామాజిక దార్శనికుడు మహాత్మా జ్యోతిరావు పూలే అని, ఆయన దేశానికి ఎన్నో సేవలు అందించారని కొనియాడారు. వర్ణ వివక్షను రూపుమాపడం కోసం, దళిత బహుజన మహిళా వర్గాల అభ్యున్నతి కోసం పూలే ఆచరించిన కార్యాచరణ మహోన్నతమైనదని పేర్కొన్నారు. కుల, లింగ వివక్షకు తావు లేకుండా విద్య, సమానత్వం ద్వారానే సామాజిక, ఆర్థిక సమున్నతికి బాటలు పడతాయనే పూలే ఆలోచనా విధానాన్ని అందరూ స్ఫూర్తిగా తీసుకోవాలన్నారు. ఆయన సహచరి సావిత్రీబాయిపూలేకు గురువుగా మారి ఉన్నత విద్యావంతురాలిగా తీర్చిదిద్దడం ద్వారా సావిత్రీబాయి మొట్టమొదటి మహిళా ఉపాధ్యాయురాలిగా చరిత్రలో నిలిచిపోయారని కలెక్టర్ పేర్కొన్నారు. కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ ప్రతిమాసింగ్, బీసీ సంక్షేమ అధికారి విమల, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.



పూలే చిత్రపటానికి నివాళులర్పిస్తున్న వికారాబాద్ కలెక్టర్ నారాయణరెడ్డి తదితరులు

### సామాజిక సాధికారతకు కృషి

వికారాబాద్ : బడుగు బలహీన వర్గాల అభ్యున్నతికి, స్త్రీ విద్య కోసం పాటుపడిన జ్యోతిరావు పూలే అందరికీ ఆదర్శప్రాయుడని వికారాబాద్ కలెక్టర్ నారాయణరెడ్డి అన్నారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో పూలే జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ముందుగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. మహిళలకు విద్యను అందించేందుకు అహర్నిశలు శ్రమించిన జ్యోతిరావు పూలే జయంతి వేడుకలను ప్రభుత్వం అధికారికంగా నిర్వహించడం సంతోషంగా ఉందని తెలిపారు. సామాజిక కార్యకర్త, మేధావి, కులాలకు అతీతంగా బడుగు బలహీన వర్గాల సంక్షేమం కోసం, వారిలో ఆత్మ స్థైర్యం కల్పించి హక్కుల కోసం పోరాడి సాధికారతకు కృషి చేశారని పేర్కొన్నారు. తన భార్య సావిత్రీబాయి పూలేతో కలిసి భారతదేశంలో మహిళలకు విద్యను అందించేందుకు పాఠశాలలను ప్రారంభించి విద్యను సమాన హక్కుగా మహిళలకు అందించేందుకు కృషి చేశారని ఆయన తెలిపారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ లింగ్యానాయక్, బీసీడీవో ఉపేందర్, ఏవో అమరేందర్ కృష్ణ, ఏబీసీడీవో భీమరాజు, హాస్టల్ వెల్ఫేర్ ఆఫీసర్స్, కలెక్టరేట్, బీసీ వెల్ఫేర్ సిబ్బంది పాల్గొన్నారు.



పూలే చిత్రపటానికి నివాళులర్పిస్తున్న వికారాబాద్ ఎస్పీ కోటిరెడ్డి, పోలీసు సిబ్బంది

### పూలే అడుగుజాడల్లో నడవాలి

మహాత్మా జ్యోతిరావు పూలే జయంతి సందర్భంగా గురువారం జిల్లా ఎస్పీ కార్యాలయంలో ఎస్పీ కోటిరెడ్డి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎస్పీ అంటరానితనం, కుల వ్యవస్థ నిర్మూలన, మహిళలకు విద్యను అందించడంలో పూలే చేసిన కృషిని వివరించారు. అణగారిన వర్గాల ప్రజల అభ్యున్నతి కోసం, వారికి విద్యను అందించడం కోసం పూలే అహర్నిశలు కష్టపడ్డారన్నారు. నేటి యువ తరం పూలే గురించి తెలుసుకొని ఆయన అడుగుజాడల్లో నడవాలని ఎస్పీ సూచించారు. కార్యక్రమంలో ఏఆర్ డీఎస్పీ వీరేశ్, డీఎస్‌బీ ఇన్‌స్పెక్టర్ రాజు, ఆర్‌ఐ డెవిడ్, ఆర్ ఎస్సైలు, సిబ్బంది పాల్గొన్నారు.

### పూలేను ఆదర్శంగా తీసుకోవాలి

జ్యోతిరావుపూలేను ప్రతి ఒక్కరూ ఆదర్శంగా తీసుకోవాలని వికారాబాద్ ఎమ్మెల్యే, స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్ తెలిపారు. వికారాబాద్ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో పూలే చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. స్త్రీ విద్య కోసం ఎంతో కృషి చేసిన జ్యోతిరావుపూలే, సావిత్రీబాయిపూలేలను మనమెప్పటికీ గుర్తుంచుకోవాలన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షులు, కౌన్సిలర్ సుధాకర్‌రెడ్డి, పీఏసీఎస్ మాజీ చైర్మన్ కిషన్‌నాయక్, నాయకులున్నారు.



జ్యోతిరావు పూలే చిత్రపటానికి నివాళులర్పిస్తున్న అసెంబ్లీ స్పీకర్ ప్రసాద్‌కుమార్



విలేకరుల సమావేశంలో మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డి

# ఓటమి భయంలో రేవంత్‌రెడ్డి..!

- పూటకో మాట మాట్లాడుతున్న ముఖ్యమంత్రి
- కుట్ర పన్నుతున్నది కుటుంబ సభ్యులా..? పార్టీ నాయకులా..?
- సిమెంటు, ఫార్మా కంపెనీలు తీసుకొస్తే అడ్డుకుంటాం..
- బీఆర్ఎస్ హయాంలో రూ.4వేల కోట్లతో కొడంగల్ అభివృద్ధి
- మంజూరైన నిధులను రద్దు చేయడం తగదు
- మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డి

కొడంగల్, ఏప్రిల్ 11 : రేవంత్‌కు పార్లమెంట్ ఎన్నికల్లో ఓటమి భయం పట్టుకున్నదని.. అందుకే పూటకో మాట మాట్లాడుతున్నారని మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డి అన్నారు. గురువారం స్థానిక మహాలక్ష్మీవేంకటేశ్వరాలయ వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా నిర్వహించిన రథోత్సవంలో పాల్గొని స్వామివారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. సర్వేలు, ఇంటెలిజెన్స్ రిపోర్టుల ప్రకారం రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీకి అధిక సీట్లు వస్తాయని నివేదికలు రావడంతో సీఎం రేవంత్‌రెడ్డికి ఓటమి భయం పట్టుకుందని.. అందుకే పూటకో మాట మాట్లాడుతున్నారని ఎద్దేవా చేశారు.

ఈ నెల 6న తుక్కుగూడలో జరిగిన బహిరంగ సభలో సీఎం మాట్లాడుతూ 'ఎన్నికల్లో ఇచ్చిన ఆరు గ్యారెంటీల్లో ఐదింటిని పూర్తిచేయడంతో ప్రజలందరూ సంతోషంగా ఉన్నారని.. కాంగ్రెస్ పార్టీ 120 రోజుల పాలన రానున్న పార్లమెంట్ ఎన్నికలకు ఓ రెఫరెండమ్ అని.. తెలంగాణలో 14 ఎంపీ స్థానాలు గెలుస్తామన్నారు.. అదేవిధంగా ఈ నెల 8న కొడంగల్‌లోని తన నివాసంలో జరిగిన పార్టీ కార్యకర్తల సమావేశంలో.. కాంగ్రెస్‌ను ఓడించేందుకు కుట్రలు జరుగుతున్నాయని చెప్పడం హాస్యాస్పదం'గా ఉందన్నారు. పై వ్యాఖ్యలను బట్టి తాను ఇన్‌చార్జిగా ఉన్న మహబూబ్‌నగర్, చేవెళ్ల, మల్కాజ్‌గిరి పార్లమెంట్ స్థానాల్లో ఓటమి ఖాయమని ఆయన ఒప్పుకొన్నట్లు నరేందర్‌రెడ్డి పేర్కొన్నారు.

కాంగ్రెస్‌ను ఓడించేందుకు కుట్రలు జరుగుతున్నాయని, కొడంగల్ ఆత్మగౌరవాన్ని దెబ్బతీస్తున్నారని చెప్పడం హేళనగా ఉన్నదని.. కుట్రలు పన్నుతున్నది కుటుంబ సభ్యులా..? కాంగ్రెస్ నాయకులా..? అని ప్రశ్నించారు. పార్లమెంట్ ఎన్నికల్లో 50 వేల మెజార్టీని సాధిస్తే కొడంగల్‌లో అభివృద్ధి పనులు జరుగుతాయి.. లేదంటే జరగవు అన్నట్లుగా మాట్లాడుతూ ప్రజలను బ్లాక్‌మెయిల్, భయభ్రాంతులకు గురి చేయడం తగదన్నారు.

గతంలో కేసీఆర్ ప్రభుత్వం కొడంగల్ అభివృద్ధికి రూ.4 వేల కోట్ల నిధులను మంజూరు చేసి అభివృద్ధికి కృషి చేసిందన్నారు. ఎన్నికలకు ముందు మరో రూ.900 కోట్ల నిధులు మంజూరు కాగా.. వాటిని ప్రస్తుత ప్రభుత్వం రద్దు చేసి కొడంగల్ అభివృద్ధిని అడ్డుకుంటున్నదని ఆరోపించారు.

### నిధులు మంజూరు చేసి కొడంగల్‌ను మరింత అభివృద్ధి చేయాలి

కొడంగల్ ప్రజలకు ఉపాధి అవకాశాలు కల్పించేందుకు టెక్స్‌టైల్, ఐటెక్స్, టెస్లా వంటి పెద్ద కంపెనీలను ఏర్పాటు చేయాలని.. అంతేకాని సిమెంట్, ఫార్మా కంపెనీలను తీసుకొచ్చేందుకు యత్నిస్తే వాటిని అడ్డుకుని ప్రజల పక్షాన పెద్ద ఎత్తున నిరసనలు చేపడుతామని ఆయన హెచ్చరించారు. దౌల్తాబాద్ మండలంలోని చంద్రకల్ గ్రామంలో ఇదివరకే 100 ఎకరాల స్థలాన్ని కంపెనీల ఏర్పాటుకు ప్రభుత్వానికి అప్పగించడం జరిగిందని, టెస్లా వంటి కార్ల కంపెనీని అక్కడ ఏర్పాటు చేయాలని సూచించారు. ఆలయాలు, చర్చిలు, మసీదుల అభివృద్ధికి గత ప్రభుత్వం రూ.50 కోట్లను మంజూరు చేసిందని.. వాటిని నిర్మించకుండా రద్దు చేయడం తగదని నరేందర్‌రెడ్డి అన్నారు.

రాష్ట్రంలో ప్రస్తుతం కరువు ఛాయలు అలుముకున్నాయని, ఎక్కడ చూసినా అన్నదాతలు సాగునీటికి.. మహిళలు తాగునీటికి ఇబ్బందిపడుతున్నారన్నారు. సీఎం రేవంత్ రెడ్డి నిధులను మంజూరు చేసి కొడంగల్‌ను మరింతగా అభివృద్ధి చేయాలన్నారు. రంజాన్ వేడుకల్లో పాల్గొన్న ఆయన ముస్లిం సోదరులకు పండుగ శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో కౌన్సిలర్ మధుసూదన్‌యాదవ్, బీఆర్ఎస్ నాయకులు విష్ణువర్ధన్‌రెడ్డి, యాదగిరి, నారాయణరెడ్డి, నరోత్తంరెడ్డి, రాజేందర్, పవన్, అరుణ్‌కుమార్ పాల్గొన్నారు.

# కరెంటు కష్టం.. పంట నష్టం

- సరఫరా సరిగా లేక గింజ పట్టే సమయంలో ఎండిపోతున్న వరి
- లోఓల్టేజీ సమస్యతో తరచూ కాలిపోతున్న బోర్ మోటర్లు, స్టార్టర్లు
- ట్రాన్స్‌ఫార్మర్‌కు పూర్తిస్థాయిలో మరమ్మతులు కరువు
- సమస్యను పరిష్కరించాలని కోరుతున్నా పట్టించుకోని అధికారులు
- విద్యుత్ సమస్యలు, ఎండిన పంటలతో ఆందోళనలో అన్నదాతలు



మంబాపూర్‌లో ఎండిపోయిన వరి పంట

పెద్దేముల్, ఏప్రిల్ 11 : రైతులు ఆరుగాలం పండించిన పంట చేతికి వచ్చే సమయంలో ఏదో ఒక రకంగా ఇబ్బందిపడి రైతులు అనేక రకాలుగా నష్టపోతున్నారు. గతంలో బీఆర్ఎస్ పార్టీ అధికారంలో ఉన్నప్పుడు పంట పొలాలకు 24 గంటల నాణ్యమైన కరెంటు ఇచ్చిన విషయం అందరికీ తెలిసిందే. ప్రస్తుతం అందుకు భిన్నంగా కరెంట్ సరిగ్గా ఉండకపోవడంతోపాటు భూగర్భ జలాలు పూర్తిగా అడుగంటిపోవడం, బోర్లలో సరిగా నీరు రాక అన్నదాతలు పంటల సాగు కోసం అష్టకష్టాలు పడుతున్నారు.

### ఎండిన వరి పంటలు

పెద్దేముల్ మండల పరిధిలోని మంబాపూర్ గ్రామంలోని ఎస్సీ కాలనీలో సుమారు 3 డీటీఆర్‌లతో కూడిన ఓ ట్రాన్స్‌ఫార్మర్ ఉన్నది. ఆ ట్రాన్స్‌ఫార్మర్ పరిధిలో సుమారు 8 బోరు మోటర్లు ఉన్నాయి. అందులో రెగ్యులర్‌గా సుమారు 6 బోర్ మోటర్లు నడుస్తున్నాయి. ఈ ట్రాన్స్‌ఫార్మర్ పరిధిలో రైతులు సుమారు 15 ఎకరాల వరిని పండిస్తున్నారు. ట్రాన్స్‌ఫార్మర్ కాలనీకి అడ్డంగా ఉండడంతో కొద్ది రోజుల క్రితం ట్రాన్స్‌ఫార్మర్‌ను విద్యుత్ అధికారులు రోడ్డు వైపునకు షిఫ్ట్ చేశారు. ట్రాన్స్‌ఫార్మర్‌ను మార్చే సమయంలో ఎర్తింగ్ సరిగా ఇవ్వలేదు, ఆన్ ఆఫ్ బటన్‌లను కూడా పెట్టలేదు. దీంతో ఓల్టేజీ తక్కువై తరచుగా బోర్ మోటర్లు, స్టార్టర్లు కాలిపోతున్నాయి. రైతులకు బోర్ మోటర్లు, స్టార్టర్ల రిపేర్ తిప్పలు తప్పడంలేదు. ఒకవైపు బోర్లలో భూగర్భజలాలు అడుగంటిపోయి నీళ్లు రాక ఇబ్బందులు పడుతుంటే.. లోఓల్టేజీ సమస్యతో నీళ్లందక వరి పంట గింజ పట్టే సమయంలో పూర్తిగా ఎండిపోయి ఎంతోమంది రైతులు నష్టపోయి అప్పుల్లో కూరుకుపోతున్నారు. ట్రాన్స్‌ఫార్మర్‌కు మరమ్మతులు చేయాలని, ఎర్తింగ్‌తో పాటు, ఆన్ ఆఫ్‌లను పెట్టాలని సంబంధిత విద్యుత్ లైన్‌మెన్లు, అధికారులను కోరితే వారు ఎర్తింగ్‌కు సంబంధించిన పైపులు, ఇతర సామగ్రి మీరే తెచ్చుకోండంటూ సమాధానం చెబుతున్నారని రైతులు వాపోతున్నారు.



పూర్తిస్థాయిలో మరమ్మతులకు నోచని విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్

### విద్యుత్ అధికారుల నిర్లక్ష్యమే శాపమైంది



మంబాపూర్‌లోని ఎస్సీ కాలనీలో ఉన్న ట్రాన్స్‌ఫార్మర్‌కు సరిగా మరమ్మతులు చేయకపోవడంతోనే మా వరి పంటలు ఎండిపోయాయి. పలుమార్లు ట్రాన్స్‌ఫార్మర్‌కు మరమ్మతులు చేయాలని కోరినా వారు పట్టించుకోలేదు. పైగా ఎర్తింగ్ పైపులు ఇతర సామగ్రి మొత్తం మీరే తెచ్చుకోండి అని చెబుతున్నారు. రైతులు పంటలు పండించాలంటే అటు విద్యుత్ సమస్యలు, ఇటు ఆర్థిక ఇబ్బందులు తప్పడం లేదు. ఇప్పటికైనా అధికారులు మా సమస్యను త్వరగా పరిష్కరించాలి.

\- రేగొండి శ్రావణ్‌కుమార్, రైతు, మంబాపూర్

### లో ఓల్టేజీతో మోటర్లు, స్టార్టర్లు కాలిపోతున్నాయి



భూగర్భ జలాలు పూర్తిగా అడుగంటిపోవడంతో బోరు బావుల్లో నీళ్లు పూర్తిగా అడుగంటిపోయాయి. ఉన్న నీటిని మోటర్ల సాయంతో తోడి పంటలను సాగు చేసుకుందామంటే విద్యుత్ సమస్యలతో అది కూడా కుదరడంలేదు. మా గ్రామంలో ఎస్సీ కాలనీ నుంచి మార్చిన ట్రాన్స్‌ఫార్మర్‌కు సరిగా ఎర్తింగ్ ఏర్పాటు చేయకపోవడంతో లోఓల్టేజీ సమస్యతో మా బోరు మోటర్లు, స్టార్టర్లు తరచూ కాలిపోతుండడంతో వాటి రిపేరుకు చాలా డబ్బులు ఖర్చవుతున్నాయి. అధికారులు లోఓల్టేజీ సమస్యను వెంటనే పరిష్కరించి మాలాంటి నిరుపేద రైతులకు న్యాయం చేయాలని వేడుకుంటున్నా.

\- ఎంగూరి బాలప్ప, రైతు, మంబాపూర్



సభ పనులకు భూమి పూజ చేస్తున్న చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్య

## ప్రజా ఆశీర్వాద సభను విజయవంతం చేయాలి

**చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్య**

చేవెళ్లటౌన్, ఏప్రిల్ 11 : చేవెళ్లలో 13న నిర్వహించే బీఆర్ఎస్ పార్టీ ప్రజా ఆశీర్వాద సభకు పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్దసంఖ్యలో తరలివచ్చి విజయవంతం చేయాలని చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్య తెలిపారు. చేవెళ్లలోని ఫరా ఇంజినీరింగ్ కళాశాల ఆవరణలో నిర్వహించే ప్రజా ఆశీర్వాద సభకు ఏర్పాట్లకు గురువారం చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్య, బీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు గ్యాదరి బాలమల్లు, రాంబాబు యాదవ్‌లతో కలిసి భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే యాదయ్య మాట్లాడుతూ.. ఈ నెల 13న ప్రజా ఆశీర్వాద సభను లక్షమందితో నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ సభకు జిల్లా నలుమూలల నుంచి ప్రజలను తరలించనున్నట్లు చెప్పారు. ఎంపీ అభ్యర్థి కాసాని జ్ఞానేశ్వర్ గెలుపు కోసం ప్రతీ కార్యకర్త కష్టపడి పనిచేయాలని కోరారు. కాసానిని భారీ మెజార్టీతో గెలిపించాలని ప్రజలను కోరారు. కాంగ్రెస్ ప్రభుత్వం పాలన గాలికి వదిలేసి కేసీఆర్‌ను బద్‌నాం చేయడమే పనిగా పెట్టుకున్నదన్నారు. పదేండ్ల బీఆర్ఎస్ పాలనలో సంతోషంగా ఉన్న ప్రజలు.. కాంగ్రెస్ కష్టాల కన్నీళ్ల పాలన మాకొద్దని మళ్లీ కేసీఆరే ముఖ్యమంత్రిగా రావాలని కోరుకుంటున్నారని తెలిపారు. కాంగ్రెస్ ప్రజా వ్యతిరేక పాలనకు ఆదిలోనే ముకుతాడు వేసేందుకు పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్ఎస్‌ను గెలిపించాలని కోరారు. తెలంగాణలో కేసీఆర్ హయాంలో రైతులకు 24 గంటల కరెంట్ ఇచ్చారని, ప్రస్తుత ప్రభుత్వం కరెంట్ ఏవిధంగా ఇస్తుందో గ్రామీణ ప్రాంతాల్లో ఉన్న ప్రతీ రైతన్నకు తెలుసని ఎమ్మెల్యే పేర్కొన్నారు. కార్యక్రమంలో కేసీఆర్ ప్రోగ్రాం ఇన్‌చార్జి అమృత్ చౌహాన్, చేవెళ్ల మాజీ ఎంపీపీ బాల్‌రాజ్, బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు ప్రభాకర్, మార్కెట్ కమిటీ మాజీ వైస్ చైర్మన్ నర్సింహులు, డైరెక్టర్లు వెంకటేశ్, మహేశ్ ఉన్నారు.

## కుంభకోణాల కాంగ్రెస్‌ను దేశ ప్రజలు నమ్మే పరిస్థితి లేదు

**చేవెళ్ల బీజేపీ ఎంపీ అభ్యర్థి కొండా విశ్వేశ్వర్‌రెడ్డి**



కేతిరెడ్డిపల్లిలో పాదయాత్ర చేస్తున్న మాజీ ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి

మొయినాబాద్, ఏప్రిల్ 11 : కుంభకోణాలకు కేరాఫ్ అడ్రస్‌గా మారిన కాంగ్రెస్ పార్టీని దేశ ప్రజలు విశ్వసించే పరిస్థితి లేదని.. దేశంలో కాంగ్రెస్ మళ్లీ రెండు డిజిట్లకే పరిమితమవుతుందని చేవెళ్ల బీజేపీ ఎంపీ అభ్యర్థి కొండా విశ్వేశ్వర్‌రెడ్డి అన్నారు. విశ్వేశ్వర్‌రెడ్డి చేపట్టిన ప్రజా ఆశీర్వాద యాత్ర గురువారం మొయినాబాద్ మండలానికి చేరుకున్నది. మండల పరిధిలోని నక్కలపల్లి, కేతిరెడ్డిపల్లి, వెంకటాపూర్ గ్రామాల్లో ఆయన యాత్ర కొనసాగింది. అనంతరం శంషాబాద్ మండలానికి చేరుకున్నది. ఈ సందర్భంగా ఆయా గ్రామాల్లో మాట్లాడుతూ.. గతంలో పదేండ్లు అధికారంలో ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వం సహజ వనరుల నుంచి నెట్‌వర్క్ వరకు (2జీ స్పెక్ట్రమ్) వరకు అవినీతికి పాల్పడి దేశ సంపదను కొల్లగొట్టిందని తెలిపారు. కాంగ్రెస్ వస్తే అవినీతికి పాల్పడుతుందని ప్రజలు భావిస్తున్నారని చెప్పారు. 10 ఏండ్ల బీజేపీ పాలనలో ఒక్క అవినీతి చూపించే దమ్మూ ధైర్యం కాంగ్రెస్ పార్టీకి ఉన్నదా అని ప్రశ్నించారు. ప్రధాని నరేంద్ర మోదీ పాలనలో దేశం ఎంతో అభివృద్ధి సాధించిందని తెలిపారు. కాంగ్రెస్ పార్టీ తరపున చేవెళ్ల ఎంపీ అభ్యర్థిగా ఉన్న రంజిత్‌రెడ్డి దేవుడి భూములను వదలకపోవడంతోపాటు చిన్నారులకు అంగన్‌వాడీ కేంద్రాల్లో పౌష్టికాహారంలో భాగంగా అందించే కోడిగుడ్లలో సైతం అవినీతికి పాల్పడ్డాడని తెలిపారు. అక్రమ సంపాదన కాపాడుకోవడం కోసం అధికారంలో ఏ పార్టీ ఉంటే ఆ పార్టీలోకి మారే వ్యక్తిని చేవెళ్ల పార్లమెంటు నియోజకవర్గ ప్రజలు నమ్మే పరిస్థితి లేదని ఆయన స్పష్టం చేశారు. కార్యక్రమంలో చేవెళ్ల మాజీ ఎమ్మెల్యే కేఎస్ రత్నం, బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ప్రకాశ్, ప్రభాకర్‌రెడ్డి, బీజేపీ మండల అధ్యక్షుడు మధుసూదన్‌రెడ్డి, మాజీ అధ్యక్షులు గోపాల్‌రెడ్డి, నర్సింహారెడ్డి, నాయకులు రాజమల్లేశ్, ప్రభాకర్‌రెడ్డి, శ్యాంసుందర్‌రెడ్డి, సీతారాంరెడ్డి, శ్రీకాంత్, లక్ష్మణ్ పాల్గొన్నారు.




సంగమేశ్వర దేవాలయం వద్ద శివనాగిరెడ్డి, నాయకులు

## సంగమేశ్వర ఆలయాన్ని కాపాడుకోవాలి

**పురావస్తు పరిశోధకుడు డా. శివనాగిరెడ్డి**

బొంరాస్‌పేట, ఏప్రిల్ 11 : మండల కేంద్రానికి కిలోమీటర్ దూరంలోని హైదరాబాద్–బీజాపూర్ జాతీయ రహదారి పక్కన ఉన్న సంగమేశ్వర దేవాలయంలోని అరుదైన గుహాలయం, శివలింగాలను కాపాడుకోవాలని, దీనిని పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేయవచ్చని పురావస్తు పరిశోధకుడు, ప్లీచ్ ఇండియా ఫౌండేషన్ సీఈవో డాక్టర్ శివనాగిరెడ్డి అన్నారు. గురువారం ఆయన సంగమేశ్వర దేవాలయాన్ని సందర్శించారు. సంగమేశ్వర దేవాలయం క్రీ.శ.13వ శతాబ్దంలోని కాకతీయుల కాలం నాటిదని, తెలంగాణలోనే అరుదైన గుహాలయం అని, రాతిని తొలిచి మలిచిన శివలింగం, చుట్టూ నంది, వినాయకుడు, నాగదేవత, శివభక్తుల శిల్పాలు, ఆలయంలోని గణేష్, రాతిని తొలిచి మలిచిన శివలింగం, ఇతర శిల్పాలను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నియోజకవర్గ సమగ్రాభివృద్ధిలో భాగంగా చారిత్రక ప్రాధాన్యత గల ఆలయాలను అభివృద్ధి చేసే అవకాశం, అధ్యయనంలో భాగంగా ఆలయాన్ని సందర్శించానని, కాకతీయుల కాలం నాటి సంగమేశ్వర దేవాలయానికి వనరులు కల్పిస్తే జాతీయ రహదారి పక్కన పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేయవచ్చని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేస్తానని శివనాగిరెడ్డి చెప్పారు.



స్వామివారికి పట్టు వస్త్రాలు సమర్పిస్తున్న సీఎం సతీమణి గీతారెడ్డి

## పట్టువస్త్రాలు సమర్పణ

కొడంగల్, ఏప్రిల్ 11 : మహాలక్ష్మి వేంకటేశ్వరస్వామి 44వ వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా గురువారం అంగరంగ వైభవంగా రథోత్సవ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా సీఎం రేవంత్‌రెడ్డి సతీమణి గీతారెడ్డి స్వామివారికి పట్టువస్త్రాలు సమర్పించారు. మొదటిసారిగా సీఎం సతీమణి హోదాలో కొడంగల్‌కు ఆమె విచ్చేసిన సందర్భంగా ఆలయ అర్చకులు ఘన స్వాగతం పలికి, ప్రత్యేక పూజలతో పాటు ఆమెను ఆశీర్వదించారు.